

అశోకా ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రసంగిస్తున్న జి.కిషన్‌రెడ్డి

వీర్ బల్ దివస్ సందర్భంగా కాగడాల ప్రదర్శన

గోల్నాక, డిసెంబర్ 27 (ఆంధ్రజ్యోతి): వీర్ బల్ దివస్‌ను పురస్కరించుకుని గురువారం రాత్రి బీజేపీ గోల్నాక డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఛే నంబర్ చౌరస్తా నుంచి గోవింద్‌నగర్‌లోని అశోకా ఫంక్షన్‌హాల్ వరకు కాగడాలతో ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి హాజరై ప్రదర్శనను ప్రారంభించి పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి అశోకా ఫంక్షన్ హాల్‌లో జరిగిన సభలో ప్రసంగించారు. ఈ సందర్భంగా సాహెబ్ జాదే గురు గోబింద్‌సింగ్ కుమారుల చిత్రప్రదర్శనను నిర్వహించారు. బీజేపీ గోల్నాక డివిజన్ అధ్యక్షుడు మూల రవీందర్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు, చరణ్‌జీత్ సింగ్‌మాన్, అమృత్‌పాల్‌సింగ్, కన్నె రమేష్‌యాదవ్, కేసరి నర్సింగ్‌రావుయాదవ్, ఏడెల్లి అజయ్‌కుమార్, శ్యామ్‌రాజ్, అమృత, దేవేందర్‌సింగ్, ఉబేరాయ్, గురుదీప్ సింగ్, ఎస్.శ్రీధర్‌గౌడ్, కె.రాంచందర్, నాగభూషణచారి, ఎస్.రాజేష్, బి.ఈశ్వర్‌రావు, రమేష్, జ్యోతి, స్వప్నప్రియ, కుల్వీందర్‌కౌర్, మీను, సోనీకౌర్ పాల్గొన్నారు.



పడిపూజలో ఎంపీ లక్ష్మణ్, కార్పొరేటర్ రచనశ్రీ, గురుస్వామి చిత్రకుమార్‌గౌడ్

బండానగర్‌లో మహాపడిపూజ

కవాడిగూడ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దోమలగూడ బండానగర్‌లో గురుస్వామి, బీజేపీ ఓబీసీ మోర్చా కవాడిగూడ డివిజన్ అధ్యక్షుడు చిత్రకుమార్ గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం 28వ మహాపడిపూజను ఘనంగా నిర్వహించారు. ఈ అయ్యప్ప స్వామి మహాపడిపూజకు బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్, కవాడిగూడ కార్పొరేటర్ జి.రచనశ్రీలు ముఖ్య అతిథులుగా హాజరై పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహాపడిపూజకు అయ్యప్ప భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. పూజలతో పరిసర ప్రాంత అయ్యప్ప భజనలతో మారుమ్రోగింది. అనంతరం పూజలకు హాజరైన అతిథులను గురుస్వామి చిత్రకుమార్‌గౌడ్ స్వామి శాలువాలుకప్పి సన్మానించారు. పూజా కార్యక్రమంలో ముషీరాబాద్ కన్వీనర్ ఎం రమేష్‌రాం, బీజేపీ రాష్ట్ర నాయకులు జి వెంకటేష్, పరిమళ్‌కుమార్, రంగరాజ్‌గౌడ్, డివిజన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎంసి మహేందర్‌బాబు, ఎ.ప్రభాకర్ గంగపుత్ర, మురారి శెట్టి కేశవరాజు, నాయకులు ఉమేష్, పూస రాజు, నలంద్రి దిలీప్‌యాదవ్ భక్తులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీఎస్.రావు తదితరులు

ఆర్టీసీని ప్రైవేటుపరం చేసే కుట్ర

● జనవరి 6న రాష్ట్ర సదస్సు

నల్లకుంట, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కాలుష్య నియంత్రణ పేరుతో విద్యుత్ బస్సులను ప్రవేశపెట్టి ఆర్టీసీని ప్రైవేటుపరం చేసే యోచనలో కేంద్రం ఉందని టీజీఎస్ ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి వీఎస్.రావు అన్నారు. ఆర్టీసీలో ప్రవేశపెట్టి ఎలక్ట్రికల్‌బస్సుల ద్వారానే కాలుష్య నియంత్రణ ఆవుతుందా అని ఆయన ప్రశ్నించారు. గ్రేటర్ హైదరాబాద్ జోన్‌లోని అన్ని డిపోలలో విద్యుత్ బస్సులను తీసుకురావాలనే ప్రభుత్వం ఆలోచిస్తుందన్నారు. ఈమేరకు శుక్రవారం విద్యానగర్‌లోని ఫెడరేషన్ కార్యాలయంలో జనవరి 6న జరిగే రాష్ట్ర సదస్సు వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ బస్సులు ఆర్టీసీల ప్రైవేట్ ఆపరేటర్లతో నడపడం వల్ల మెకానిక్‌లు, డ్రైవర్లకు పనులు కేండా అవుతుందని, దీంతో ఆర్టీసీ మనుగడ ప్రశ్నార్థకం అవుతుందని తెలిపారు. జనవరి 6న జరిగే రాష్ట్ర సదస్సులో ఆర్టీసీ మెకానిక్‌లు, డ్రైవర్లు, కండక్టర్లు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీజీఎస్ ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ గ్రేటర్ హైదరాబాద్ జోన్ అధ్యక్ష, కార్యదర్శులు పి.చంద్రప్రకాష్, జి.ఆర్.రెడ్డి, నాయకులు ఎస్.కృష్ణ, కె.ఆర్.రెడ్డి, యాదగిరి, వెంకటేష్, ఎస్.బి.చారి, సీఐటీయు నాయకుడు కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.



అంజయ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గోపాల్, కార్పొరేటర్ జి రచనశ్రీ, పూస రాజు సంఘం నేతలు

అంజయ్య సేవలు మరువలేనివి

కవాడిగూడ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రజకుల అభివృద్ధికి నిరంతరం పాటుపడిన మహోన్నత వ్యక్తి డాక్టర్ ఎం అంజయ్య అని పలువురు వక్తలు కొనియాడారు. రజకులు సమగ్రాభివృద్ధి సాధించడమే అంజయ్యకు నిజమైన నివాళి అని అన్నారు. శుక్రవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని షిరిడీ సాయిబాబా దేవాలయం వద్ద ఉన్న రజకాభివృద్ధి సంస్థ వ్యవస్థాపకులు స్వర్గీయ డాక్టర్ అంజయ్య వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, కవాడిగూడ కార్పొరేటర్ జి రచనశ్రీ, ఓబీసీ మోర్చా జాతీయ నాయకులు పూస రాజు, తెలంగాణ రజక అభివృద్ధి (దోబీ) సంస్థ అధ్యక్షుడు బొమ్మరాజు కృష్ణమూర్తి, వర్కింగ్ చైర్మన్ మందలపు గాంధీ నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, డాక్టర్ అంజయ్య ఆశయాలను ప్రతిఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.



నిరసన తెలుపుతున్న సీఐటీయూ శ్రేణులు

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

చిక్కడపల్లి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్రహోమ్‌మంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ గ్రేటర్ హైదరాబాద్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్టీసీక్రాస్ రోడ్‌లో నిరసన తెలిపారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పాలడుగు భాస్కర్ పాల్గొని మాట్లాడుతూ.. భారత పార్లమెంటు సాక్షిగా కేంద్ర హోంమంత్రి అంబేడ్కర్‌ను అవమానించారన్నారు. నిరసనలో కూరపాటి రమేష్, సోమన్న, కుమారస్వామి, మల్లేష్, మోహన్, రాములు, సత్యనారాయణ, మహేందర్ పాల్గొన్నారు.

31న కొంగర జగ్గయ్య జయంతి సభ

చిక్కడపల్లి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీనటులు కొంగర జగ్గయ్య జయంతి సందర్భంగా ఈనెల 31వ తేదీ సాయంత్రం త్యాగరాయగానసభలో కవి సమ్మేళనం, శ్రీకృష్ణరాయబారం నాటకంలోని పడకసీను ప్రదర్శన ఉంటుందని ఆ సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి కవి రఘుశ్రీ తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఆజామాబాద్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా ఉండదని సీబీడీఏడీఈ నాగేశ్వరరావు తెలిపారు. డీడీహెచ్ పరిధిలోని దుర్గాబాయిదేశ్‌ముఖ్ ఆస్పత్రి, విజ్ఞాన్‌పురి కాలనీ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, రామ్‌నగర్ పరిధిలోని శ్రీనివాస టెక్స్‌టైల్స్, ఈసేవ తదితర ప్రాంతాల్లో 11 గంటల నుంచి 1.30 గంట వరకు, నల్లకుంట పరిధిలోని విజయబ్యాంక్, భారత్ ఇన్‌స్టిట్యూట్ తదితర ప్రాంతాల్లో 11.30 గంటల నుంచి 1.30 గంటల వరకు, సీసీ ష్రాఫ్ పరిధిలోని బూమన్నగల్లి, రాజేంద్రనగర్ కాలనీ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు


ఆజామాబాద్ ట్రాన్స్‌కో పరిధిలో రక్షణ చర్యలు శూన్యం




ముషీరాబాద్ ఏక్‌మినార్ మసీదు పక్కన వైర్లు తేలి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



రాంనగర్ కూరగాయల మార్కెట్ రోడ్డులో హనుమాన్ దేవాలయం వద్ద ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్



రాంనగర్‌లోని స్ట్రీట్ నెంబర్ 18 ఇంద్ర అపార్ట్‌మెంట్ వద్ద రక్షణ లేకుండా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్



న్యూఅచ్చయ్యనగర్ సివిల్ సప్లై గోదాం వద్ద ప్రమాదంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

రాంనగర్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆజామాబాద్ ట్రాన్స్‌కో పరిధిలోని ముషీరాబాద్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద రక్షణ చర్యలు లేక ప్రమాదకరంగా మారాయి. ట్రాన్స్‌ఫార్మర్లకు విద్యుత్ వైర్లు తేలి చిన్నపిల్లలకు సైతం అందేంత ఎత్తులో ఉన్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయపడుతున్నారు. ఫ్యూజ్ బాక్సులకు తలుపులు సైతం లేవు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు అధికారులు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ముషీరాబాద్ డివిజన్‌లోని ఏక్‌మినార్ మసీదు కట్టెల మండి పక్కన ట్రాన్స్‌ఫార్మర్‌కు రక్షణ లేకపోవడమే కాకుండా ప్రమాదకరంగా వైర్లు తేలి ఉన్నాయి. అడిక్‌మెట్ డివిజన్‌లోని రాంనగర్ కూరగాయల మార్కెట్‌కు హనుమాన్ ఆలయం సమీపంలో గిరిశేఖర అపార్ట్‌మెంట్ వద్ద ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. ఇదే డివిజన్‌లోని స్ట్రీట్ నెంబర్ 18లోని ఇంద్ర అపార్ట్‌మెంట్ ట్రాన్స్‌ఫార్మర్ సైతం ప్రమాదకరంగా ఉన్నాయి. రాంనగర్ డివిజన్‌లోని న్యూఅచ్చయ్యనగర్‌లో సివిల్‌సప్లై గోదాంకు వెళ్లే మెయిన్ రోడ్డు వద్ద ప్రమాదభరితంగా ఉన్నాయి. ఇలా నియోజకవర్గంలోని అనేక బస్తీలలో ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ చర్యలు కనిపించడం లేదు. పైగా ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ చెత్తాచెదారం పేరుకు పోయి కనిపిస్తున్నాయి.

రక్షణపై శ్రద్ధ కరువు



ట్రాన్స్‌కో అధికారులకు కరెంట్ బిల్లుల వసూలుపై ఉన్న శ్రద్ధ ట్రాన్స్‌ఫార్మర్ల రక్షణ విషయంలో కనిపించడం లేదు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద రక్షణ చర్యలు లేకపోవడం బాధాకరం. పేదలు నివసించే ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లపై ఫెన్సింగ్ ఏర్పాటుపై చర్యలు చేపట్టకపోవడం శోచనీయం. రక్షణ చర్యలు లేని ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ప్రమాదాలు జరిగినా అధికారులు అశ్రద్ధ వహిస్తున్నారు. ఇకనైనా అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి.

\- ఉపేందర్, బాగ్‌లింగంపల్లి

తాగునీటిపై ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

● జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వాటర్‌బోర్డు దృష్టికి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం కార్యాలయంలో ఈడీ మయాంక్ మిట్టల్, ఓఅండ్ఎం అధికారులతో ఎంసీసీ (మెట్రో కస్టమర్ కేర్) ఫిర్యాదులపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఎండీ అశోక్‌రెడ్డి మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో అధికారులు సొంతంగా ప్రణాళికలు వేసుకుని ప్రజలకు ఇబ్బందులు రాకుండా చూడాలని సూచించారు. తాగునీటి సరఫరా, కలుషిత నీటి సమస్యలపై వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. రోడ్లపై సీవరేజీ ఓవర్ ఫ్లో కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, మ్యాన్ హోళ్లు పొంగితే వెంటనే పూడిక తీయాలని సూచించారు.

ట్యాంకర్ల సరఫరాపై ఈడీ సమీక్ష

జలమండలి నీటి ట్యాంకర్ల బుకింగ్, సరఫరా తీరుపై ఈడీ మయాంక్ మిట్టల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రస్తుత ట్యాంకర్ల బుకింగ్, సరఫరా, వెయిటింగ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ట్యాంకర్లు బుక్ చేసుకున్న వారికి వీలైనంత త్వరగా సరఫరా అయ్యేలా చూడాలని అధికారులకు సూచించారు. రెసిడెన్షియల్ కోసం ట్యాంకర్లు బుక్ చేసుకునే వారికి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు.

భార్యకు ఫోన్ చేసి బలవన్మరణం

18న భువనగిరిలో ఘటన
చికిత్స పొందుతూ మృతి

భువనగిరి టౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రం భువనగిరిలోని ఎస్వీ లాడ్జిలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. పట్టణ ఎస్‌ఐ కుమారస్వామి తెలిపిన వివరాల ప్రకారం... వరంగల్ జిల్లా రాయపల్లి మండలం కొండూరు గ్రామానికి చెందిన కర్రె రాజిరెడ్డి(45) ఉపాధి నిమిత్తం కుటుంబంతో కలిసి కొద్దికాలంగా హైదరాబాద్ బోయినిపల్లి ఉమానగర్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో ఈ నెల 16వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లిన రాజిరెడ్డి మరునటి రోజు వరకు ఇంటికి వెళ్లకపోవడంతో భార్య కర్రె సరళ బోయినిపల్లి పోలీస్‌స్టేషన్‌లో 17వ తేదీన ఫిర్యాదు చేసింది. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో ఈ నెల 18వ తేదీన తెల్లవారుజామున 2 గంటలకు రాజిరెడ్డి భార్యకు ఫోన్ చేసి తాను ఆత్మహత్య చేసుకుంటున్నానంటూ వెంట తెచ్చుకున్న క్రిమి సంహారక మందును తాగుతూ వీడియో కాల్ చేసి అడ్రస్ చెప్పాడు. దీంతో ఆమె ఏడుస్తూ అడ్రస్ చెప్పాలని ప్రాధేయపడగా భువనగిరి ఎస్వీ లాడ్జి లొకేషన్‌ను షేర్ చేశాడు. ఆమె ఇచ్చిన సమాచారంతో భువనగిరి పట్టణ పోలీసులు ఎస్వీ లాడ్జికి చేరుకొని జిల్లా ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి భార్య సరళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యార్థుల స్కాలర్‌షిప్ రూ. 20 వేలకు పెంచాలి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం

బర్కత్‌పుర, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల స్కాలర్‌షిప్‌లను రూ. 5 వేల నుంచి రూ.20 వేలకు పెంచాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కాచిగూడ అభినందన్ గ్రాండ్‌లో బీసీ విద్యార్థి సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ విద్యార్థులకు ఫీజుల బకాయిలు చెల్లించకుండా ఏళ్లతరబడి జాప్యం చేస్తోందన్నారు. దీంతో పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల ఫీజుల బకాయిలు రూ.4 వేల కోట్లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇంటర్మీడియట్ కోర్సులు చదివే విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ. 1,800 నుంచి రూ.15 వేలకు పెంచాలన్నారు. విదేశీ విద్య చదివే విద్యార్థులందరికీ రూ.20 లక్షల స్టైఫండ్ మంజూరు చేయాలన్నారు. విద్యార్థుల డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ జనవరి 3న చేపట్టనున్న ఛలో కలెక్టరేట్ల ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై డిమాండ్లను సాధించుకోవాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న గుజ్జ సత్యం

శతాధిక మహనీయులకు సన్మానం

చిక్కడపల్లి: శతాధిక మహనీయులకు శుక్రవారం రాత్రి త్యాగరాయగానసభలో సన్మానం జరిగింది. చోడేశ్వర నాట్యకళామండలి ఆధ్వర్యంలో సత్యసాయిబాబా జయంతిని పురస్కరించుకుని స్వాతంత్ర్య సమరయోధులు ఏటుకూరి కృష్ణమూర్తిని సన్మానించారు. రిటైర్డ్ డీఈవో బ్రహ్మానందం ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.



సమావేశంలో పాల్గొన్న కృష్ణమూర్తి, బ్రహ్మానందం తదితరులు

టీటీడీలో తెలంగాణ ప్రజలకు అన్యాయం జరగడం లేదు



మాట్లాడుతున్న పి.సాయిబాబా

రాంనగర్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానంలో తెలంగాణ ప్రజలకు అన్యాయం జరుగుతుందని, దేవాలయం కమిటీ నిర్లక్ష్యం వహిస్తుందని మాట్లాడడం విచారకరమని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా అన్నారు. ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టే విధంగా మంత్రులు మాట్లాడడం బాధ్యతారహిత్యమైన చర్యగా ఆయన మంత్రులకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే ఇటీవల ఒక మంత్రి ఎన్టీఆర్ ఘాట్‌లో సచివాలయం కట్టాలని, ఎన్టీఆర్ ఆనవాళ్లు లేకుండా చేయాలని కుట్రలు పన్నడం దురదృష్టకరమన్నారు. శుక్రవారం పార్టీ నగర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్ర ప్రజల మనోభావాలను ఇటు తెలంగాణ ప్రజల మనోభావాలను రెచ్చగొడుతూ రాజకీయ పబ్బం గడుపుకోవాలని చేస్తున్న ప్రయత్నం అని విమర్శించారు. సమస్యలుంటే పొరుగు రాష్ట్రం సీఎంతో చర్చించుకుని పరిష్కరించుకోవాలని ఆయన పేర్కొన్నారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శులు నల్లెల కిషోర్, పి.బాల్‌రాజ్‌గౌడ్ పాల్గొన్నారు.

విద్యార్థులు కూడా వినియోగదారులే..!

చిక్కడపల్లి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కూడా వినియోగదారులేనని వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి అన్నారు. మెడికల్ సీట్ల కేటాయింపు విషయంలో మెరిట్ విద్యార్థులకు ఏదైనా అన్యాయం జరిగితే న్యాయం చేయడానికి లీగల్ సెల్ ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. శుక్రవారం సాయంత్రం గాంధీనగర్ డివిజన్ గోల్కొండ చౌరస్తాలోని మండలి రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ విద్యా సంవత్సరంలో మెడికల్ మెరిట్ విద్యార్థులకు అన్యాయం జరిగితే తమ దృష్టికి తేవాలని కోరారు. తెలంగాణలో మూడు మెడికల్ కాలేజీలకు (మొత్తం 550 సీట్లు) డీమ్డ్ యూనివర్శిటీలుగా మారడానికి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ ఇవ్వలేదని కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్శిటీ వారు ఈనెల 2న వినియోగదారుల మండలికి సమాచారం ఇచ్చారన్నారు. ఈ క్రమంలో డీమ్డ్ యూనివర్శిటీల పేరిట వెబ్ ఆప్షన్స్ నుంచి తీసేసిన 550 సీట్లు తెలంగాణ విద్యార్థులకుకేటాయింపు జరగాల్సి ఉందని కావున అర్హులైన మెరిట్ విద్యార్థులు ఎంబీబీఎస్ సీట్లను పొందడానికి అవసరమయ్యే న్యాయ సలహాలు, ఫిర్యాదుల దాఖలు కోసం హైకోర్టు న్యాయవాది మురారిశెట్టి యశ్వంత్‌కుమార్ ఆధ్వర్యంలో అయిదుగురు సభ్యులతో కూడిన లీగల్ సెల్ ఏర్పాటు జరిగిందన్నారు. సీట్ల కేటాయింపులో అన్యాయం జరిగిందని ధృవీకరించుకున్న మెరిట్ విద్యార్థులు తమ పూర్తి వివరాలు నీట్ ర్యాంక్, తెలంగాణ స్టేట్ ర్యాంక్‌లతో ఈ నెంబర్ 94403 28239 కు వాట్సాప్ మెసేజ్ పంపవచ్చునన్నారు. ఈనెల 23న న్యూఢిల్లీలోని యూనివర్శిటీ గ్రాంట్ కమిషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆయన వివరించారు.

సార్వత్రిక ఎన్నికల్లో బీసీలు అన్ని స్థానాల్లోనూ పోటీ చేయాలి



సమావేశంలో క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య తదితరులు

రాంనగర్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో అన్ని జనరల్ స్థానాలలో బీసీలు బరిలో నిలిచేలా అభ్యర్థులను తయారు చేసి చట్టసభలలో బీసీలు అధిక సంఖ్యలో అడుగుపెట్టేలా నిరంతరం పనిచేయాలని రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో బీసీ జాగృతి సేన వ్యవస్థాపక అధ్యక్షుడు బూర్గుపల్లి కృష్ణయాదవ్ ఆధ్వర్యంలో రూపొందించిన 2025 నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమానికి ఆర్.కృష్ణయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతీ నియోజకవర్గంలో బీసీ చైతన్య సదస్సులు నిర్వహించి బీసీలను రాజకీయంగా చైతన్యం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

బీసీలకు హక్కులను కాలరాస్తున్న అగ్రకుల రాజకీయ పార్టీల కుట్రలను ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు అనంతయ్య, వెంకటేష్‌యాదవ్, గొడుగు నరసింహులు, బాలయ్య, రాగ్య రమేష్, ఆశీష్‌గౌడ్, టింకు తదితరులు పాల్గొన్నారు.

మన్మోహన్‌సింగ్‌కు ఘన నివాళి



బర్కత్‌పురాలోని తన కార్యాలయంలో మాజీ ప్రధాని నమ్మోహన్‌సింగ్‌కు నివాళులర్పిస్తున్న దిడ్డి రాంబాబు, కాంగ్రెస్ నేతలు రాజేష్‌లాల్, హుస్సేన్, వెంకటేష్, కిషోర్‌యాదవ్, భారతమ్మ, అనిత తదితరులు

(జోన్ బృందం, ఆంధ్రజ్యోతి):

మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ భారత ఆర్థిక వ్యవస్థకు భాగ్య విధాత అని టీపీసీసీ కార్యదర్శి ఎన్.అజయ్‌కుమార్, టీపీసీసీ ఓబీసీ సెల్ వైస్ చైర్మన్ కట్టెల సుభాష్, టీపీసీసీ ఎస్సీ సెల్ మాజీ చైర్మన్ జీ.బీ.శ్యామ్‌రావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎస్.హరినాథ్‌రెడ్డి, కే.పీ.మురళీకృష్ణలు కొనియాడారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు మన్మోహన్ చిత్రపటాలకు నివాళులర్పించారు.



పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఆలిండియా కాంగ్రెస్ ఫిషర్‌మెన్ కమిటీ కార్యదర్శి బిజ్జి శత్రు తదితరులు



నగర కేంద్ర గ్రంథాలయం చైర్మన్ కేసిరెడ్డి ఉపేందర్‌రెడ్డి మన్మోహన్‌సింగ్‌కు నివాళులర్పిస్తున్న ఉపేందర్‌రెడ్డి, పద్మజ తదితరులు



మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పించిన కాంగ్రెస్ బీ-బ్లాక్ కమిటీ అధ్యక్షుడు అంజయ్యదవ్, రాజ్‌దీప్